# ఈ మాసం - మీ రాశిఫలాలు

శ్రీ పరాశరం బాలసుబ్రహ్మణ్యం, తిరుచానూరు.



## మేషరాశి

ఈ రాశివారికి ఈ మాసం లాభ నష్టాలు సమాన స్థాయిలో వుంటాయి. అభివృద్ధి చెప్పుకోదగ్గ స్థాయిలో వుండదు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవటం చాలా అవసరము. భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించినట్లు కనిపిస్తుంది కాని మాసాంతానికి అన్ని సర్దుకుంటాయి. విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయి. బంధువుల మధ్య మనస్పర్థలు వచ్చే అవకాశం వుంది. వాటి వల్ల చిక్కులు కలుగుతాయి. అయితే మాసాంతానికి ఆ చిక్కులు తొలగిపోయే అవకాశం వుంది. మీరు కోరుకున్న వాహనాన్ని కొనే అవకాశం కలదు. వ్యవసాయదారులకు ఈ మాసం కొద్దిగా అనుకూలమనే చెప్పవచ్చు. స్త్రీలకు ఈ మాసం బాగుంటుంది. ఇరుగు పొరుగు విషయాలలో జోక్యం చేసుకోకుండ వుండటం అన్ని విధాల మంచిది.



## వృషభరాశి

ఈరాశివారు ఈ మాసంలో ఏర్పడిన చిక్కులను ధైర్యంగా ఎదుర్కొంటే చివరకు మంచి ఫలితాలనే పొందుతారు. కోర్టు వ్యవహారాలలో ఈ రాశివారికి ప్రతికూల పరిస్థితులు ఎదురైనట్లు కనిపించినప్పటికి చివరికి అనుకూలంగానే ముగుస్తాయి. వివాదాల విషయంలో రాజీ ధోరణిలో సాగడం అన్ని విధాల మంచిది. కుటుంబంలోని వారి ఆరోగ్యం బాగుంటుంది. విద్యార్థులకు మంచి కాలమనే చెప్పవచ్చు. నిరుద్యోగులకు ఈ మాసంలో ఉద్యోగము లభించే అవకాశం వుంది. ఇనుము, బంగారం, వెండి వ్యాపారస్థులకు ఈ మాసం లాభాలు ఆశించిన స్థాయిలో వుండదు. ఆటోమొబైల్ రంగంవారికి మాత్రం మంచి అభివృద్ధి కనిపిస్తుంది. ఉద్యోగస్తులకు స్థాన చలనము కలిగి జీతంలో కొద్దిపాటి మార్పులు జరుగుతాయి. రాజకీయ నాయకులకు మంచి కాలమనే చెప్పవచ్చు.



## మిధునరాశి

మిధునరాశివారికి ఈ మాసం చాలా బాగుంటుంది. ఇంతవరకు కుటుంబంలో వున్న ఇబ్బందులన్నీ తొలగిపోయి మానసిక శాంతి లభిస్తుంది. వ్యాపారస్తులకు అనుకున్న విధంగా లాభాలు రావడం జరగకపోవచ్చు కాని నష్టాలు మాత్రం రావు. నిరుద్యోగులకు కొద్దిపాటి ప్రయత్నంతో మంచి ఉద్యోగము లభించే అవకాశం వుంది. విదేశీ ప్రయాణం చేయదలచుకొన్నవారికి ఆ అవకాశం అతి త్వరలో లభించవచ్చు. భూ, గృహ, వాహన, వస్త్ర ఆభరణములు సేకరించుకొనుటకు ఇది మంచి కాలము. వ్యవసాయదారులకు ఈ మాసం అన్నివిధాల బాగుంటుంది. గతంలో చేసిన అప్పులు కొన్ని తీరే అవకాశం వున్నది. ఆడంబరాలకు పోకుండా వుండడం మంచిది. స్త్రీలకు మంచి కాలము. వివాహంకాని వారికి సంబంధం కుదురుతుంది.



## కర్కాటక రాశి

ఈరాశివారికి ఈ మాసంలో కుటుంబంలో ఏర్పడిన చిక్కులవల్ల మనశ్శాంతి వుండదు. దైవ ధ్యానం చేయడం ఆలయ సందర్శనంవల్ల కొంత మేలు చేకూరుతుంది. నిరుద్యోగులుగా వున్న వారికి అతి కష్టంమీద ఉద్యోగం లభించవచ్చు. ఉద్యోగస్తులకు పెద్ద మార్పు ఏమి వుండదు. సాధారణంగ కాలం గడుస్తుంది. పదోన్నతి విషయంలో అనుకోని చిక్కులు ఏర్పడతాయి. వ్యాపారస్తులకు సాధారణ కాలము. అప్పుల విషయంలో చాల జాగ్రత్త వహించటం అవసరం. ఇతరులకు కోర్టుపరంగాగాని, అప్పులపరంగాగాని పూచీకత్తులు ఇవ్వక పోవడమే చాలా మంచిది. ఏ పని చేయదలచుకున్న ముందు వెనుకలు ఆలోచించి చెయ్యాలి. స్త్రీలకు సాధారణముగా వుంటుంది. ఆరోగ్యం విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.



## సింహ రాశి

ఈ రాశివారు ఈ మాసం మొదటి రెండు వారాలలో కొన్ని శుభ పరిణామాలను చూస్తారు. భూములు, ఇండ్లు కొనుగోలు విషయంలో గతంలో ఏర్పడిన చిక్కులు తొలగిపోతాయి. సంఘములో మీకు కీర్తి, ప్రతిష్టలు, గౌరవము పెరుగుతుంది. అనుకోని విధంగా ఓ మిత్రుడి సహాయంవల్ల ఆర్థిక

పరిస్థితి మెరుగు పడుతుంది. కళాకారులకు చాలా మంచికాలము. వారు కోరుకున్న విధంగా అభివృద్ధిని సాధిస్తారు. ఆరోగ్యము పట్ల శ్రద్ధ వహించాలి. ఉద్యోగులకు స్వల్ప మార్పులు వుంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడవచ్చు.



## కన్యా రాశి

ఈ రాశివారికి ఈ మాసంలో అనుకున్నవన్నీ జరిగే అవకాశం వుంది. వ్యాపారస్తులకు మంచి కాలమేనని చెప్పవచ్చు. కోపాన్ని తగ్గించుకోవడంవల్ల అన్ని విధాల లాభ పడతారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. కోర్టు వాజ్యాలు వున్నవారికి ఈ మాసంలో కాస్త నిరాశే ఎదురవుతుంది. విధ్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారు. విదేశీ ప్రయాణం అనుకున్నంత సులభంగా జరగదు. రచయితలు, కవులు, కళాకారులకు ప్రభుత్వపరంగాను, సామాజికంగాను గౌరవ మర్యాదలు పొందుతారు. రాజకీయ రంగంలోవున్నవారికి సాధారణ కాలమనే చెప్పాలి.



## తులా రాశి

ఈ రాశివారికి ఈ మాసంలో ఎదురు చూడని శుభ పరిణామాలు జరుగుతాయి. గతంలో ఏర్పడిన చిక్కులు తొలగిపోయే అవకాశం వుంది. సంతానం, వివాహ విషయాలలో మీరు కోరుకున్న సంబంధమే ఖాయం అయ్యే అవకాశం వుంది. స్థిరాస్తి కొనుగోళ్ళు, కొత్త వ్యాపారాలు ప్రారంభించటానికి ఈ మాసం అంత అనుకూలంగానే లేదు. వ్యవసాయదారులకు ఈ మాసం గతంలో కన్న బాగుంటుంది. కుటుంబంలోని వృద్ధులు జబ్బుపడి తద్వారా ధన వ్యయం అయ్యే అవకాశం వుంది.



## వృశ్చిక రాశి

ఈ రాశివారు తలపెట్టిన ఏ కార్యమైనా శుభంగానే జరుగును. రాజకీయాలలో వున్నవారికి ఈ మాసంలో అనుకోని మార్పులు సంభవించి తద్వారా ఆనందం లభిస్తుంది. కొత్త పరిచయాలు ఏర్పడి కొత్త ప్రదేశాలకు ప్రయాణమయ్యే అవకాశం వుంది. సంతానం వివాహ విషయంలో కోరుకున్న సంబంధమే నిశ్చయం అవుతుంది. విద్యార్థులు పోటీపరీక్షల్లో మంచి రాంకు సాధించే అవకాశం వుంది. విదేశీయానం ఖాయం అవుతుంది.



## ధనూ రాశి

ఈ మాసం మీకు అన్ని విధాల సాధారణంగా వుంటుంది. కుటుంబ సంబంధాలు మామూలుగా వుంటాయి. మాట తొందరపాటువల్ల చిక్కులు వచ్చే అవకాశం వుంది. అందువల్ల వివాదాల విషయంలో మౌనంగా వుండటం మంచిది. ఈ రాశిలోని స్త్రీలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తగ వుండటం మంచిది. విద్యావంతులై నిరుద్యోగులైన యువతులకు ఉద్యోగాలు వచ్చును. కొత్తస్నేహాలు ఏర్పడతాయి. వివాహ విషయంలో కొద్దిగ ఆలస్యం జరుగుతుంది. ఉద్యోగుల బదలీలు జరగడం ఆలస్యం అవుతుంది.



## మకర రాశి

మకర రాశివారికి ఈ మాసంలో సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు సాధారణంగా వుంటాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ మాసం బాగుంటుందనే చెప్పవచ్చు. భూముల కొనుగోలు విషయంలో జాగ్రత్త వహించటం మంచిది. ఉద్యోగస్తులకు పలుకుబడి, హోదా పెరిగి వారు కోరుకున్న స్థానానికి కొద్దిపాటి ఆలస్యంగ బదలీ జరుగుతుంది. సిమెంటు, ఇనుము, బంగారం, వెండి వ్యాపారస్తులకు గడ్డుకాలమనియే చెప్పవచ్చును. స్త్రీలకు సాధారణంగ వుంటుంది. నవగ్రహ ప్రదక్షిణలవల్ల మంచి జరుగుతుంది.



## కుంభ రాశి

ఈ రాశిలోని రాజకీయ నాయకులకు అనుకోని మార్పులు సంభవిస్తాయి. విదేశీ ప్రయాణం చేసే అవకాశం వుంది. మీరు చేసే పనులవల్ల ప్రజలలో మరింత పలుకుబడి పెరుగుతుంది. సంగీత, నాట్య, నాటక, సినిమా కళాకారులకు కీర్తి, ధనాదాయము లభిస్తుంది. విద్యార్థులకు మంచి కాలము. వివాహాల విషయంలో కొద్దిపాటి ఆలస్యం జరిగినా అనుకున్న సంబంధాలే కుదురుతాయి. సాధ్యమైనంతవరకు వివాదాల జోలికి పోకుండ వుండటం మంచిది. పిత్రార్జితం ఆస్తులపై వున్న చిక్కులు తొలగిపోతాయి. మొత్తంమీద శుభంగానే వుంటుంది.



## మీన రాశి

ఈ రాశివారికి ఈ మాసం మంచి ఫలితాలు పెద్దగ వుండవు. అతి ప్రయత్నం వల్ల కొద్దిపాటి శుభాలను చూడగలుగుతారు. విద్యార్థులు మంచి ఫలితాలకోసం చాలా శ్రమ పడవలసి వస్తుంది. వ్యవసాయదారులకు కూడ అంత బాగుండదు. అనుకోని ఖర్చులు ఏర్పడి అప్పులు చేయువలసి వస్తుంది. రాజకీయ నాయకులకు సాధారణ కాలము. ఉద్యోగులకు స్థానమార్పు సంభవించవచ్చు. స్త్రీలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి.